

ఇద్దరు దొంగల అరెస్టు

సూర్యాపేటలో జూలై 21 రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు.

- 8లో



మూసీకి భారీగా వరద

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8,633 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,99,544 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,95,450 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,217 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	6,006 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	2,067 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా కార్యవర్గం నియామకం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి శనివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా మైల నరసింహ, శాగ చంద్రశేఖర్ రెడ్డి, బచ్చనబోయిన దేవేందర్‌యాదవ్, సజ్జల నాగిరెడ్డి, వనం నరేందర్‌రెడ్డి, పకీర్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మన్సాల వెంకన్న నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శులుగా ఇస్లావత్ బాలాజీనాయక్, రమనగోని దీపిక, ఏరుకొండ నర్సింహ, తాటిపాముల శివకృష్ణగౌడ్, ఇరిగిసెట్టి అనిత, పబ్బు వెంకటేశ్వర్లును నియమించారు. జిల్లా కోశాదికారిగా కాసాల జనార్ధన్‌రెడ్డి, ఉప కోశాధికారిగా తుమ్మలపల్లి హనుమంతరెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా గోసెట్టి భద్రమ్మ, కార్యాలయ ఉప కార్యదర్శిగా మంగిలిపల్లి కృష్ణమూర్తి, ఐటీ ఇన్‌చార్జిగా కంచుగొమ్ముల వేణును నియమించారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్ కుంభం



వ్యవసాయ మంత్రి తుమ్మలతో కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టౌన్ : పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించిన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశారదన్ మహరాజ్, కూసుకుంట్ల, జాజుల తదితరులు

సంస్థాన్ నారాయణపురం: రాజ్యాధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉద్యమించాలని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని కంకణాలగూడెంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచన విధానాలు గొప్పవని, వాటిని యువత ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్వి యాదయ్య, నర్రి నర్సింహ, బైరి శేఖర్, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

వాసవీ ఆలయానికి స్వర్ణ రథం



ఆలయం వద్ద స్వర్ణ రథం

- 17, 18 తేదీల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలు

దేవరకొండ : తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయానికి స్వర్ణ రథాన్ని దేవరకొండ ఆర్యవైశ్య సంఘం నాయకులు సమకూర్చారు. ఈ నెల 17, 18 తేదీల్లో స్వర్ణరథం ప్రారంభోత్సవానికి దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. 18న రథోత్సవ ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

వేడుకగా కృష్ణాష్టమి







కృష్ణాష్టమి సందర్భంగా శనివారం నల్లగొండలోని యాదవ సంఘం భవనం వద్ద ఉట్టి కొడుతున్న యువకులు, కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మాంగళ్యం చూపిస్తున్న వేద పండితులు

సఖీ సెంటర్‌లో కుట్టు మిషన్ల పంపిణీ



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : సఖీ సెంటర్‌లలో 17 మంది మహిళలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ రిసోర్స్ సెంటర్ పర్ ఉమెన్, ఓల్డ్ సాలిదారిటీ సహకారంతో కుట్టు మిషన్లు అందజేశామన్నారు. బాధిత మహిళలకు పోలీస్, న్యాయ శాఖల సమన్వయంతో త్వరగా న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సఖీ కేంద్రానికి నెలకు సుమారు 70 కేసులు వస్తున్నాయని.. వాటిని త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని కె.కృష్ణవేణి, సుమలత, సునీత, వరుణ శ్రీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హాజరుకు.. తప్పదు మూల్యం

పంచాయతీ కార్యదర్శుల వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్

- జిల్లాలో 69 మందికి ఛార్జ్ మెమోలు
- వారి పదోన్నతులు, ఇంక్రిమెంట్లు కట్..
- స్వాతంత్ర్య దినోత్సవ అవార్డులు సైతం నిలిపివేత



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పంచాయతీ కార్యదర్శుల నకిలీ హాజరును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వారందరికి ఛార్జ్ మెమోలు జారీ చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకానున్నా హాజరైనట్లుగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పుడు పద్ధతిలో నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలోనే గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ ఆ నకిలీ హాజరు వేసినవారి వివరాలను జిల్లాలకు పంపి.. వారిపై చర్యలకు ఆదేశించింది. దీంతో వారికి ఛార్జ్ మెమోలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఫొటోలతో హాజరు నమోదు

జిల్లాలో 844 పాత పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులంతా ప్రతి రోజు ఆయా గ్రామాలకు వెళ్లి వారికి ఇచ్చిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో అటెండెన్స్ వేయాలి. కానీ.. కొందరు కార్యదర్శులు తప్పుడు పద్ధతిలో హాజరు నమోదు చేశారు. 69 మంది పంచాయతీ కార్యదర్శులు విధులకు వెళ్లకుండానే.. వెళ్లినట్లుగా ఆ పంచాయతీలో పనిచేసే కార్యదర్శుల చేత తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేయించారు. గ్రామ పంచాయతీల వారీగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో వేసిన అటెండెన్స్ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్న సర్వర్‌కు వెళ్తుంది. అక్కడ పరిశీలించిన అధికారులు కొందరు నకిలీ అటెండెన్స్ వేసినట్లు గుర్తించారు. వారి వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపించారు.

ఇప్పటికే నోటీసులు జారీ

జిల్లాలో తప్పుడు పద్ధతిలో అటెండెన్స్ వేసిన 69 మంది కార్యదర్శులకు.. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు డీపీఓ వెంకయ్య నోటీసులు జారీ చేశారు. ఎందుకు తప్పుడు పద్ధతిలో అటెండెన్స్ వేశారనే దానిపై వివరణ కోరారు. ఆ కార్యదర్శులు ఆ నోటీసుకు సమాధానం ఇచ్చారు. అయినా వారి వివరణ సక్రమంగా లేదని తేలింది. వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వారందరికీ ఛార్జ్ మెమోలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే చార్జ్ మెమోలకు సంబంధించిన అనుమతి వచ్చినట్లు తెలిసింది. దీంతో సోమవారం లేదంటే మంగళవారం వారికి చార్జ్ మెమోలు జారీ చేసే అవకాశం ఉంది.

పదోన్నతులు, ఇంక్రిమెంట్లకు ఇబ్బందే

ఫేక్ అటెండెన్స్ వేసిన 69 మంది పంచాయతీ కార్యదర్శులకు ఛార్జ్ మెమోలు ఇస్తే వారికి ఇబ్బందులు తప్పవు. పదోన్నతులు ఆగిపోవడంతో పాటు ఇంక్రిమెంటు కూడా కట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ కార్యదర్శులు ఆర్థికంగా నష్టపోతారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందించగా.. అయితే ఈ ఫేక్ అటెండెన్స్ కారణంగా పంచాయతీ కార్యదర్శులకు మాత్రం అవార్డుల్లో చోటు దక్కలేదు.

కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు

ఫేక్ అటెండెన్స్‌కు సంబంధించి 69 మందికి ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. వారు వాటికి సమాధానాలు ఇచ్చారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపించాం. కలెక్టర్ నిర్ణయం మేరకే చర్యలు తీసుకుంటాం.

– వెంకయ్య, డీపీఓ

సమగ్రాభివృద్ధి సాధించేలా..

- గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ
- జిల్లాలో ఆరు పాఠశాలల్లో పది రోజులపాటు కార్యక్రమం
- ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్న విద్యార్థులు



గ్రూపు డిస్కషన్ చేస్తున్న విద్యార్థులు

పెద్దవూర : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధించేలా గిరిజన సంక్షేమ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యుక్త వయస్సులోని బాల, బాలికలకు చదువుతో పాటు ఆరోగ్యం, లైఫ్ స్కిల్స్ చాలా ప్రధానం. శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన లేక గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు అనారోగ్యం బారిన పడుతుంటారు. వీటిపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌కు చెందిన వాయిస్ 4 ఎన్‌జీఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాయ్స్ అండ్ గరల్స్ 4 చేంజ్ ఫైర్ ఫైల్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని ఆరు ఆశ్రమ పాఠశాలలు ముదిగొండ, దేవరకొండ, తెల్దేవర్‌పల్లి, అయిటిపాముల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలు, దేవరకొండ, పెద్దవూర బాలుర ఆశ్రమ పాఠశాలల్లోని ఏడు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి కౌన్సిలర్లచే పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ 14వ తేదీన ముగిసింది.

రోజుకో అంశంపై శిక్షణ..

పది రోజుల శిక్షణలో రోజుకు ఒక అంశంపై విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. కలల నుంచి వాస్తవిక జీవితం, విజయం ఎలా సాధించాలి, ఉద్యోగాల్లోని రకాలు, ఆరోగ్య జీవన విధానం, హక్కులు, విధులు, కౌమరదశలో వచ్చే మార్పులు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ సాగింది. అకాడమిక్, నాన్ అకాడమిక్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, నాణ్యమైన ఉన్నత విద్య, విభిన్న రంగాల్లో ఉపాధి పొందేందుకు కావాల్సిన నైపుణ్యాలను సాధించటమే లక్ష్యంగా బాల, బాలికలకు శిక్షణ సాగింది. గ్రూపు డిస్కషన్ నిర్వహించి వారి ప్రాంతాల్లోని సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను బోధించారు. శిక్షణ చివరి రోజు శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేశారు.

ఎన్నో విషయాలను నేర్చుకున్నాం



పది రోజుల శిక్షణలో ఎన్నో విషయాలను నేర్చుకున్నాం. కమ్యూనికేషన్ స్కిల్స్, ఎవరితో ఎలా మాట్లాడాలి, పెద్దవాళ్లను ఎలా గౌరవించాలో నేర్చుకున్నాం. చదువుతో పాటు సమాజంలో ఎలా మసలుకోవాలో నేర్పించారు. పది రోజుల శిక్షణ ఎంతో సరదాగా, సంతోషంగా సాగింది. ఈ అంశాలను నిజ జీవితంలో అన్వయించుకుంటాం.

– డి.హర్షవర్ధన్, 8వ తరగతి, పెద్దవూర ఆశ్రమ పాఠశాల

మానసిక స్థైర్యం నింపడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలలు అంటే చాలా మంది చిన్నచూపు ప్రదర్శిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వీరిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి వాటిని ఎదుర్కొనేలా ప్రేరణ కల్పించాం. లింగ వివక్ష, సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు ఈ శిక్షణ అవకాశం కల్పించింది. చిన్నతనం నుంచే సమాజంపై గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకునేలా శిక్షణ ఉపయోగపడింది.

– ముధావత్ చత్రు, డీటీడీఓ, నల్లగొండ

నీలగిరిలో జంతు వధశాల

- రూ.5 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు
- కలెక్టరేట్ వెనుక స్థలం కేటాయింపు
- తీరనున్న వ్యాపారులు, వినియోగదారుల ఇబ్బందులు



రోడ్డుపై మేకపోతులను కోస్తున్న వ్యాపారులు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో ఎన్నో ఏళ్లుగా జంతు వధశాల (స్లాటర్ హౌస్) ఏర్పాటుకు అడుగుల పడుతున్నాయి. నగర అభివృద్ధి పథకంలో భాగంగా సీడీఎంఏ ప్రత్యేక నిధుల ద్వారా మున్సిపాలిటీకి రూ.6 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రూ.5 కోట్లను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో జంతు వధశాల నిర్మాణానికి కేటాయించారు. నిర్మాణ పనుల కోసం త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమవుతోంది.

రోడ్లపై కోయడంతో ఇబ్బందులు

నీలగిరి పట్టణంలో ఇప్పటి వరకు జంతు వధశాల లేదు. దీంతో మాంసం వ్యాపారులు పానగల్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, ప్రధాన కూడళ్లలో కూడా రోడ్ల మీదనే జంతువులను వధిస్తున్నారు. దీంతో వాటి వ్యర్థాల కారణంగా ఆ ప్రదేశాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు, ఈగలు వ్యాప్తి కూడా పెరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు మంత్రి కోమటిరెడ్డి చొరవతో త్వరలోనే జంతు వధశాల నిర్మాణం కానుంది. జంతు వధశాల నిర్మాణం కోసం కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. ఈ స్థలంలోనే జంతు వధశాల నిర్మించాలని అధికారులు నిర్ణయించారు.

వెటర్నరీ వైద్యుడు ధ్రువీకరించిన తర్వాతే..

నీలగిరి పట్టణంలో వందలాది యాట పోతులు కోస్తున్నా వాటిని ఏ అధికారి కూడా పరీక్షించలేదు. వాటిల్లో నాణ్యమైనవి ఏవో గుర్తించే అవకాశాలు లేకపోవడంతో వినియోగదారులకు కూడా నాణ్యమైన మాంసం లభించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వధశాల అందుబాటులోకి వచ్చిన తర్వాత వెటర్నరీ వైద్యుడు వ్యాపారులు తెచ్చిన జంతువులను పరీక్షించి ఆరోగ్యంగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే వాటిని వ్యాపారులకు అప్పగిస్తారు. పశు వైద్యులు తిరస్కరిస్తే సంబంధిత యాట పోతులను వధించడానికి వీలు లేదు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వ్యాపారులకు మున్సిపల్ యంత్రాంగం జరిమానాలు విధించనుంది. దీంతో వినియోగదారులకు నాణ్యమైన మాంసం లభించనుంది.

18న అంగన్‌వాడీల ధర్నా

నల్లగొండ టౌన్ : సమస్య పరిష్కారానికి ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి బి.పార్వతీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18వేలు ఇస్తామని చెప్పిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టుల కోసమే రాజీనామా డ్రామా

- రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస.. అభివృద్ధిపై లేదు
- మునుగోడుకు మంత్రులను, ఎంపీని రానివ్వడం లేదు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


సంస్థాన్ నారాయణపురం: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టుల కోసమే రాజీనామా డ్రామా ఆడుతున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రూ.18వేల కోట్ల కాంట్రాక్టుల కోసం గతంలో రాజీనామా చేసి ఉప ఎన్నిక తెచ్చాడని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస మునుగోడు అభివృద్ధిపై లేదన్నారు. శనివారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని కంకణాలగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూసుకుంట్ల మాట్లాడారు. 'ప్రభుత్వం సహకరిస్త లేదని అంటున్నావు.. మీ అన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఒక్కసారైనా మునుగోడు నియోజకవర్గానికి తీసుకొచ్చావా' అన్ని ప్రశ్నించారు. మునుగోడుకు నేనే మంత్రి.. నేనే రాజుగా రాజగోపాల్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని, మంత్రులను, ఎంపీని రానివ్వడం లేదన్నారు. 'ఎల్‌బీనగర్ నుంచి పోటీచేస్తే మంత్రి పదవి వచ్చేదని అంటున్నావు.. మునుగోడుపై ప్రేమ ఉంటే మంత్రి పదవి ఎందుకు. మంత్రి పదవి స్టేజీల మీద మాట్లాడితే రాదు.. అధిష్టానంతో మాట్లాడితే వస్తుంది' అని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వల్ల మునుగోడు నాశనం అవుతుందన్నారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తావో.. ఇంకేం చేస్తావో కానీ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. సుశీలమ్మ ఫౌండేషన్‌కు నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, తాను ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు చేపట్టానని అన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలే కనిపిస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట నారాయణపురం మండల బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్రి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితోనే ప్రజాపాలన



అమరవీరుల స్థూపాన్ని పరిశీలిస్తున్న వీహెచ్, ఎమ్మెల్యేలు వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

శాలిగౌరారం : అమరవీరుల స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందని ఏఐసీసీ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామంలో నాడు రజాకార్ల చేతిలో పదిమంది ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తన సొంత ఖర్చులతో నిర్మించిన అమరవీరుల స్థూపాన్ని తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌లతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లానే కేంద్రబిందువు అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు దండ అశోక్‌రెడ్డి, గూని వెంకటయ్య, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్, భూపతి వెంకటేశ్వర్లు, రామలింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమ్మ కాంతులు

విద్యుద్దీపాల వెలుగులో నాగార్జునసాగర్ 20 క్రస్ట్‌గేట్ల ద్వారా పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

క్లుప్తంగా

మూసీకి భారీగా వరద

● 8 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8,633 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయిలో ఉండటంతో అధికారులు శనివారం ఎనిమిది క్రస్ట్ గేట్లను రెండు అడుగులు పైకెత్తి దిగువకు 10వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 140 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాలువలకు, గేట్ల ద్వారా, ఆవిరి, సీపేజీ, లీకేజీ రూపంలో ప్రాజెక్టు నుంచి మొత్తం 10,200 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాయంత్రం వరకు 642.50 అడుగులుగా నీటిమట్టం ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శంకర్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కొక్కిరాల గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బొత్యతండాకు చెందిన రామావత్ శంకర్ (23) డిగ్రీ చదువుతున్నాడు. బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు శుక్రవారం రాత్రి తమ గ్రామానికి సమీపంలోని వెంకటంపేట వద్ద గల పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా.. కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి తార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన గోపిక, శ్రీకృష్ణులు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులను గోపికలు, శ్రీకృష్ణుడిగా అలంకరించి ఫొటోలు తీసి పంపించాలనే 'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. తల్లిదండ్రులు తమ చిన్నారులను అందంగా ముస్తాబు చేసి ఫొటోలు తీసి వాట్సాప్‌లో పంపించారు. వాటిలో కొన్ని..



శ్రీమన్, నాంపల్లి · మైథిలి, దేవరకొండ · మేఘశ్రీ, శాన్వీ, కట్టంగూరు · ఎం.వీరాజ్ కార్తికేయ, గట్టుప్పల్ · సజ్జల మాన్సీరెడ్డి, మిర్యాలగూడ · చేగొండి కుందన్ యాదవ్, అనుముల · దూదిమెట్ల వేదాన్ష్ యాదవ్, పాలెం, నకిరేకల్ మండలం · సిరబోయిన మాన్విక్ యాదవ్, వట్టిమర్తి

గుండు శ్రీనీష్, వెంకటరమణకాలనీ · శ్రీ లక్ష్మీ శివాన్ష్, నల్లగొండ · రాణా ఋగ్వేద్ రెడ్డి, శ్రీనగర్ కాలనీ · గుర్రం సుదీక్ష, రిశాన్, శ్రీనగర్ కాలనీ · కురుపాటి సుతీర్థ్ ఆత్రేయన్, సూర్యనగర్ కాలనీ · అబ్బగోని మహితేజ్ గౌడ్, శ్రీ వర్షిత, ఓగోడు, నకిరేకల్ · దేవులపల్లి వర్షిత్, విద్య, నకిరేకల్ · చేకూరి కృత్తికా రెడ్డి, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ · చిమట దేవాన్ష్ యాదవ్, గుండ్లపల్లి, నల్లగొండ · శరణి, నకిరేకల్

హస్విక్ మోక్ష, నకిరేకల్ · విక్కి, పెద్దవూర · శ్రీనికేతన్‌రెడ్డి, కార్తికేయన్ రెడ్డి, శాంతినగర్, నల్లగొండ · లెశంత్, శివాజీనగర్, నల్లగొండ · మన్విత్ మోక్ష, నకిరేకల్ · బోయపల్లి అయాన్ష్ నందన్, పుల్లెంల · గద్దం లూలు, పాతబస్తీ · చిన్ను, శ్రీనగర్ కాలనీ, · తేజాన్ష్‌రెడ్డి, నల్లగొండ · మాస సూర్య, ప్రకాశం బజార్, నల్లగొండ · వియాన్ష్, పెద్దవూర

అన్నభీమోజు నైనిక, ఎం.గౌరారం, కనగల్ · శిలాన్, ఓల్డ్‌సిటీ, నల్లగొండ · అయ్యాన్ష్ రెడ్డి, జొన్నగడ్డలగూడెం · గోల్డి, నకిరేకల్ · యువాన్‌గౌడ్, అరోశి, త్రిపురారం · పుణ్యమూర్తి శ్రీహాన్, డిండి · నల్లగంతుల సాయి శ్రీరామ్, శాఖపురం · హిమాన్ష్, విద్యా నగర్, నల్లగొండ · భావాని శంకర్, రామగిరి, నల్లగొండ · గద్దం, అరూషి, పాతబస్తీ, నల్లగొండ · నెలికంటి సిద్విక్ యాదవ్, వెలిమినేడు, చిట్యాల · బెల్లి హన్సిని · మేడమ్ష్ యాదవ్, వెలిమినేడు, చిట్యాల

బొమ్మపాల ప్రశాంతి, హాలియా, అనుముల · వేముల అన్విక, ఊటుకూరు, శాలిగౌరారం · సిద్ధార్థ్‌రెడ్డి, పామనగుండ్ల, కట్టంగూర్ · జాన్విక, జాన్వి, పానగల్, నల్లగొండ · అభిజ్ఞ, తిరుమలగిరి · భోగరాజు నిధి శ్రీ, చింతపల్లి · కిలారి లాస్య శ్రీ, లక్ష్మీ శ్రీ, పెద్దవూర · ఈర్గుల దేశ్విక, శాఖపురం · జి. జాన్వి, పద్మావతి కాలనీ, నల్లగొండ · స్మితిక, నాగార్జున కాలనీ, నలగొండ

కృతిక, పరాశర, పానగల్, నల్లగొండ · ఆరాధ్య, పెద్ద దేవులపల్లి త్రిపురారం · నిహారిక, నల్లగొండ · తుమ్మ అయాన్ష్‌రెడ్డి, నల్లగొండ · సాన్విక, మిర్యాలగూడ · కె ఆరూష్, మిర్యాలగూడ, · జి.పార్థుప్రణవ్, హనుమాన్‌నగర్ · అశిశ్‌గౌడ్, బంగారిగడ్డ, చండూర్ · గుండగోని మన్యు, రామగిరి, నల్లగొండ · వల్లపు దేవాన్ష్ శ్రీనగర్ కాలనీ · సిరిపురం ఉద్వాన్ష్, నల్లగొండ

పొరుగు సేవల ఉద్యోగ ప్రకటన – నీటి పారుదల శాఖ, నల్లగొండ

నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టు క్రింద నీటిపారుదల శాఖలో వివిధ మండలాలలోని వివిధ గ్రామాలలో డిండి, దేవరకొండ, చందంపేట, నేరెడుగొమ్ము, చింతపల్లి, కొండమల్లేపల్లి, నాంపల్లి, మునుగోడు, చండూరు, గట్టుప్పల్, మర్రిగూడ, నకిరేకల్, చిట్యాల, నార్కట్‌పల్లి లస్కర్-35, హెల్పర్- 5 మొత్తం పోస్టులు 40 పొరుగు సేవల ప్రాతిపదికన రూపాస్ ఏజెన్సీ ద్వారా నియామకము చేయుటకు గాను ఆసక్తి గల అభ్యర్థుల నుండి ధరఖాస్తులు కోరనైనది. పైన తెలిపిన పోస్టుల నెలసరి వేతనము రూ॥ 15,600/- కనీస విద్యార్హత లస్కర్‌కు 7వ తరగతి, హెల్పర్‌కు 10వ తరగతి వయస్సు 18 నుండి 45 సం॥ల లోపు ఫిజికల్ ఫిట్‌నెస్ కలిగిన వారిని రోస్టర్ ప్రాతిపదికన నియామకము చేయబడును.

ధరఖాస్తు చేయగోరు అభ్యర్థులు మండల పరిధిలో గ్రామాలకు సంబంధించిన వారై ఉండవలెను. ధరఖాస్తు చేయగోరు అభ్యర్థులు విద్యార్హత, కుల, నివాస, ఫిజికల్ ఫిట్‌నెస్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటో కాపీలతో దరఖాస్తు చేయవలెను. అర్హత గల అభ్యర్థులు పూర్తి వివరాలకు ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

దరఖాస్తులు తేది : 18-8-2025 నుండి 28-08-2025 వరకు

ఉ॥ 10.00 గంటల నుండి సా॥ 5.00 గం॥ల వరకు కార్యాలయ పని వేళలో స్వీకరించబడును.

RURAL & URBAN POVERTY ALLEVIATION SERVICE SOCIETY

(RUPASS - Outsourcing Agency & Man Power Consultency)

H.No.8-3-211, FCI Colony, Collectorate Road, Peddabanda

RUPASS - VOLUNTARY ORGANISATION - NALGONDA

Cell: 9440578595, 9908976966



సినీ దర్శకుడిగా రాణిస్తున్న నిడమనూరు వాసి

● 'ఫ్రెండ్లీ ఘోస్ట్' సినిమాకు దర్శకత్వం వహించిన మధుసూదన్‌రెడ్డి

నిడమనూరు: నిడమనూరు మండలం గోపువారిగూడెం గ్రామానికి చెందిన గోపు మధుసూదన్‌రెడ్డి సినీ రంగంలో రాణిస్తున్నారు. ఆయన దర్శకత్వం వహించిన ఫ్రెండ్లీ ఘోస్ట్ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ హీరో మంచు మనోజ్ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సుచిన్ సినిమా బ్యానర్‌పై మాస్టర్ జియాన్ష్ సమర్పణలో సత్యం రాజేష్, సత్యదేవ్ ప్రధాన పాత్రలుగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు మధుసూదన్‌రెడ్డి వివరించారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ త్వరలో రాబోతున్నట్లు ఆయన వెల్లడించారు.



ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంచు మనోజ్, గోపు మధుసూదన్‌రెడ్డి

యాదగిరీశుడి సేవలో ఢిల్లీ హైకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట: ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజ్‌నీష్‌కుమార్ గుప్త తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు.



జస్టిస్ రాజ్‌నీష్‌కుమార్ గుప్తకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకుడు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ హైదరాబాద్, విజయవాడ హైవే నార్కెట్‌పల్లి కామినేని హాస్పిటల్ ఎదురుగా DTCP లో నార్త్, ఈస్ట్ కార్నర్ 233 చదరపు గజాల ప్లాట్ అమ్మబడును. Cont : 7095945535 [SCA25007223]

■ నల్లగొండలోని నందిహిల్స్ కాలనీ యందు హైవే రోడ్‌కు సెకండ్ బిట్, షాపుల వెనుక మూడు వైపుల రోడ్ గల ప్లాటు అమ్మకంనకు కలదు. సంప్ర॥ సెల్ : 9848039522 [YA-16098]

■ నల్గొండ పట్టణం పద్మావతి కాలనీ లో ఈస్ట్ ఫేస్ గల 630 గజముల (ఎంత కావాలి అంటే అంత) ఈస్ట్, వెస్ట్, నార్త్ రోడ్ లు గల ప్లాట్ అమ్మబడును సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9550540116 [SCA25007373]

LAND FOR SALE

■ కట్టంగూరు మండలం బొల్లెపల్లి గ్రామంలో 7 ఎకరాల వ్యవసాయ పొలం అమ్మకమునకు కలదు. సంప్ర॥ సెల్ : 8498975474 [SCA25007387]

■ భూమి కొనబడును. శ్రీశైలం & బెంగుళూరు హైవే ఫేసింగ్ ఆనుకొని 20 గుంటల నుండి 2 ఎకరాల భూమి కొనబడును. ఫోన్: 9966521191 [SCA25007319]

LEASE

■ నల్గొండ పట్టణం పద్మావతి కాలనీ లో మెయిన్ రోడ్ 1000 Sft. East Face గల ఇల్లు బ్యాంకు లు మరియు ఫైనాన్షియల్స్, లేదా ప్రైవేట్ ఆఫీస్ లకు రెంట్ లేదా లీజ్ కి ఇవ్వబడును సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9550540116 [SCA25007383]

Wanted

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931 [HA-16124]

■ బట్టల షాప్‌లో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ (M) & హెల్పర్స్ (M) 25-50 సం.ల వయస్సు , 10వ తరగతి చదివిన వారు కావలెను. జీతం: 10k-12k చిక్కడపల్లి. HYD: 9440609054 [HA-01319]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బంగారం చోరీ కేసులో ఇద్దరు దొంగల అరెస్టు

● నిందితుల నుంచి 554గ్రా. బంగారం, రూ.92,500 నగదు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని శ్రీసాయి సంతోషి జ్యూయలరీ షాపులో జూలై 21న రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. నిందితుల నుంచి రూ.60లక్షల విలువ గల 554 గ్రాముల బంగారం, రూ.92,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. సాంకేతిక ఆధారాలతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లా, బైహోర్ గ్రామానికి చెందిన ఏ-4 అయిన మాలిక్ మొల్లా అనే దొంగను ఈ నెల 11న సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నేపాల్‌కు చెందిన ఏ-6 నిందితుడు అమర్ భట్‌ను ఖమ్మం పట్టణంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏ-6 నిందితుడైన అమర్‌భట్ ఖమ్మంలో దొంగలకు ఆశ్రయం ఇవ్వడం, రెక్కీ చేసేందుకు సహాయం చేసినట్టు చెప్పారు. ఏ-4 నిందితుడైన మాలిక్ మొల్లాను పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తపన్ పోలీస్ స్టేషన్ పోలీసుల సహాయంతో అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల విలువ గల 554 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బలూర్ ఘాట్‌లోని జిల్లా కోర్టులో న్యాయమూర్తి వద్ద నిందితుడిని ప్రవేశపెట్టి ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి తీసుకుని నిందితుల రాష్ట్రాల బదిలీ (ట్రాన్సిట్) నిబంధనల ప్రకారం సూర్యాపేటకు తీసుకొచ్చారు.

జూలై 27న మహిళ అరెస్టు, 14తులాలు స్వాధీనం

ఇదే కేసుతో సంబంధమున్న మహిళను జూలై 27న అరెస్టు చేసి ఆమె వద్ద 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఆ మహిళను విచారించగా పలు విషయాలు వెల్లడించినట్టు చెప్పారు. అదేవిధంగా పట్టుబడిన మాలిక్ మొల్లాను విచారించగా నేపాల్‌కు చెందిన ఏ-1 ప్రకాశ్ అనిల్‌కుమార్, ఏ-2 కడక్‌సింగ్ అహుల్‌వాలియ, ఏ-3 పురన్‌ప్రసాద్ జోషి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లాకు చెందిన ఏ-5 జషిముద్దీన్‌తో కలిసి శ్రీసాయిసంతోషి జ్యూయలరీ షాపులో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు.

అద్దెకు తీసుకున్న రూంలో బంగారం పంచుకొని పరార్..

దొంగతనానికి పాల్పడిన దొంగలు షాపు సమీపంలో తీసుకున్న అద్దె రూంలో 5 భాగాలుగా పంచుకుని దొంగతనానికి సహకరించిన ఏ-7 అయిన యశోద అనే మహిళకు, ఏ-6 అయిన అమర్ భట్‌లకు ఖర్చుల కోసం కొంత బంగారం, డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు. నేపాల్‌కు చెందిన ఏ-1 ప్రకాష్ అనిల్ కుమార్, ఏ-6 అమర్‌భట్‌లు ఇద్దరు ఖమ్మంలో గూర్ఖాగా పనిచేస్తూ వచ్చే సంపాదన సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని ఖమ్మంలో దొంగతనాలు చేసి కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చారు.

మిగతా నిందితుల కోసం గాలింపు..

ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు కాగా అందులో ముగ్గురిని అరెస్టు చేయగా మిగతా ఏ-1 ప్రకాష్ అనిల్‌కుమార్, ఏ-2 కడాక్ సింగ్, ఏ-3 పురన్‌ప్రజోషి, ఏ-5 జషిమొద్దీన్ నిందితుల కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి



సాగర్ అందాలను ఫోన్‌లో బంధిస్తున్న పర్యాటకులు



సాగర్ డ్యాం సమీపంలో ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం సెలవు కావడంతో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్పిల్ వే మీదుగా కిందకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ పరవళ్లను ఫొటోలు తీసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల వాహనాలతో లాంచీ స్టేషన్ వద్ద, హైలాన్ కాలనీ మూడు రోడ్ల కూడలిలో, కొత్త వంతెన సమీపంలో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మంది, తెలంగాణ నుంచి 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకున్నారు.

నాగార్జునకొండలో పర్యాటకులను వదలివచ్చిన లాంచీ స్టేషన్ సిబ్బంది

నాగార్జునకొండ సందర్శనకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు లాంచీలో వెళ్లిన పర్యాటకులను నాగార్జునకొండలోనే వదిలి.. లాంచీ ఎక్కిన వారిని తీసుకుని లాంచీ స్టేషన్‌కు తిరిగి వచ్చింది. దీంతో 30 మంది పర్యాటకులు నాగార్జునకొండ పైనే ఉండిపోయారు. అక్కడున్న పర్యాటకులు ఫోన్లు చేయడంతో తిరిగి లాంచీ వెళ్లి రాత్రి వేళ వారిని తీసుకుని వచ్చింది. లాంచీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం పర్యాటకులు అందరూ వచ్చారా లేదా అని చూసుకోకుండానే తిరిగి వస్తున్నారని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



లాంచీ స్టేషన్ వద్ద కిటకిటలాడుతున్న పర్యాటకులు